# ముప్ఫయి రూపాయలు

వి. గోపాలకృష్ణ

ఒకనాటి సాయంత్రం కాలేజీలో చదువుతున్న రామమూర్తి కొడుకు వెంకటరావు, పెద్దరెడ్డి దుకాణంలో ప్రవేశించి, ఎవరూ అంతకుపూర్వం వినని కొత్తరకం పెన్ను కావాలని అడిగినప్పుడు, పెద్దరెడ్డి తడుముకోకుండా ఆ వస్తువు తెచ్చి అతనిముందు పెట్టాడు. యాభైవేలు జనాభావున్న ఆవూరిలో పెద్దరెడ్డి దుకాణం అన్నిటిలోనూ పెద్దది. అక్కడ దొరకని వస్తువు ఆ జిల్లా హెడ్ క్వార్టర్సులో కూడ దొరకదు. ఆ వూరిలో కొత్తగా పెట్టిన పంచదారమిల్లు, ఆ మిలు వుద్యోగసులకు కట్టిన పసుపుపచ్చ బంగళాలు తప్పించితే, మిగతా వూరంతా అవకతవకగావున్న యెర్రమట్టి రోడ్లతో, యెత్తరుగుల యిళ్ళతో, మధ్యనుంచి మొక్కలు మొలచి బీటలువారిన గోడలతో, పురాతన దేవాలయంతో, నిత్యం ధ్వనించే సాలీల మగ్గాలతో పాత వాసన కొడుతూవుంటుంది. అటువంటి వూరిలో, పెద్దరెడ్డి దుకాణం వుంది.

పాతికయేళ్ళక్రితం పెద్దరెడ్డి తండ్రి, వృధాప్యంలో వెనుకవీధిలో కిరాణాకొట్టుతో కాలక్షేపం చేస్తూ వుండేవాడు. అప్పటికి పెద్దరెడ్డి హైస్కూలు చదువు పూర్తిచేశాడు. యెవరైనా తన భావినిగురించి అడిగితే కాలేజీలో చదువుతాననేవాడు. తండ్రితో కూడ అదేపలికాడు. కాని పెద్దరెడ్డితండ్రి ఒప్పుకోలేదు; డబ్బు చాలదని వంక పెట్టాడు. ఒకరోజు రాత్రి:

"శ్రీనివాసరావుగారికి యేమంత యెక్కువ డబ్బువుందని, వాళ్ళ అబ్బాయిని చదివిస్తున్నారేమిటి" అని యెత్తుకున్నాడు పెద్దరెడ్డి యెలాగయినా తండ్రిని ఒప్పిద్దామని.

"వాళ్ళసంగతి వేరు. అదిగాకపోయినా వాళ్లకు మనకన్న యెక్కువడబ్బువుంది, యెంత లేకపోయినా" అన్నాడు పెద్దరెడ్డితండ్రి.

"ఆ, యెక్కువుంది! యెవరికి తెలియదులే! నెలకు ముప్ఫయిరూపాయలువుంటే చాలు అంటున్నానుగా" అన్నాడు పెద్దరెడ్డి.

"ఆ ముప్ఫయి మాత్రం యెక్కడతేవాలి?" అందుకుంది పెద్దరెడ్డితల్లి.

"అదిగాదమ్మా! ఈ చదువు చదివితే యెవరికైనా నెలకు అరవైరూపాయిలు కావాలి. మనకయితే ముప్ఫైరూపాయిలతో తేలిపోతోంది కదా! అలాంటప్పుడు మానెయ్యటం యెందుకు? పోనీ అంతగా స్కాలర్షిప్పు రాకపోతే తప్పకుండా మానేస్తానంటున్నాను గదా! అదీగాక సుబ్బారాయుడుగారు తప్పకుండా స్కాలర్షిప్ యిప్పిస్తానని చెప్పారు."

"ఆ ముప్ఫయిరూపాయిలు అయితే మాత్రం ఎక్కడ తీసుకురాను. ఇదిగోచూడు, మనకున్న ఆస్తి అంతా కలసి ఈ కిరాణాకొట్టు. దానిమీద నెలకు పాతికరూపాయిలు వస్తే మహా గొప్పఅన్నమాట. నువ్వేదో యింకో వూరుపోయి, కాలేజీలో చదువుతానంటావు. పోని ముప్ఫయి రూపాయలే అనుకో, కాని అవిమాత్రం యెలా తేవాలి?" అన్నాడు పెద్దరెడ్డి తండ్రి. పెద్దరెడ్డి ఆశ్చర్యపడ్డాడు కాని, తండ్రివైపు అనుమానంగా చూశాడు. వాళ్లు చెప్పేదాంట్లో యేదో అబద్ధముందనిపించింది.

పెద్దరెడ్డికి కళ్లనీళ్ళ పర్యంతం అయింది. అతను యిన్నాళ్లు ఉవ్విళ్ళూరిన బ్రతుకు, అతనికి కాకుండా పోయింది. ఇంకొకసారి తండ్రిని కదిలించాలనుకున్నాడు. కాని సంఘర్షణ తీవ్రం కాకపూర్వమే పెద్దరెడ్డి తండ్రి అకస్మాత్తుగా మరణించాడు. పెద్దరెడ్డికి మంకుపట్టు పట్టాల్సిన అవసరం లేకపోయింది. మరుసటి రోజునుంచి పెద్దరెడ్డి ప్రొద్దున్నే కిరాణాకొట్టు తెరిచేవాడు. మధ్యాహ్నం ఒక గంట తప్పించితే

సాయంత్రం యేడు గంటలవరకు కొట్టుమీదే వుండే వాడు.

కాని యిప్పుడు పెద్దిరెడ్డి కొట్టు మెయిన్ రోడ్డులో వుంది. అది కిరాణాకొట్టు కాదు; పెద్ద జనరల్ షాప్ అయింది. పెద్దిరెడ్డికి పూర్వం జరిగినవన్నీ కలలకన్నా మసకగా కనిపిస్తాయి. ఏమయితేనేం, పెద్దిరెడ్డి వూరికి పెద్ద. అతని మాటమీద చాల విషయాలు జరుగుతాయి; అతని సహాయంతో చాల పుణ్యకార్యాలు నెరవేరుతాయి. హైస్కూలు భవన నిర్మాణం, అతని సహాయం లేకపోతే యెంత ప్రయత్నించినా జరిగివుండేది కాదు. ఆసుపత్రి కడదామని వూరిలో వాళ్లంతా యెంత ప్రయత్నించినా, అతని చేయూత లేక ఆగిపోలేదా?

పెద్దిరెడ్డి సుఖాలను విడిచి లక్ష్మీకటాక్షం కోసం చేసిన తపస్సులో ఆనందాన్ని తప్పించితే అన్నీ సాధించాడు; ప్రేమ తప్పించితే అన్నీ అలవర్చుకొన్నాడు.

పెద్దిరెడ్డి కొట్టు పెరగటం ఆగిపోలేదు. కాలంతోపాటు అతని కొట్టు పెరుగుతూనే వుంది. దానికి తోడు, వూరిలో కొత్తగా పెట్టిన గాజు ఫ్యాక్టరీవల్ల కొట్టు పెరగటానికి కొత్త అవకాశాలు కలిగాయి. కొట్టు కొత్త గదులు ఆక్రమించింది; రెండో అంతస్తు ప్రవేశించింది. కాని యింకా పెరగటానికి గదులు కావాలి.

*　　*　　*　　*

విశాలమయిన "యస్. పెద్దిరెడ్డి అండు కంపనీ" అన్న బోర్డుప్రక్కన, సగం చెరిగిన అక్షరాలతో "కె. రామమూర్తి, కాఫీ పొడుం అమ్మబడును" అని అరడుగు బల్ల వుంది. "కె. రామమూర్తి" అన్న బోర్డును కప్పివేసేటంతవరకు తన బోర్డును పొడిగించాలని పెద్దిరెడ్డికి చాలాకాలంనుంచి ఆశ వుంది. కాని యింతవరకు తప్పనిసరి కాని కోరిక, ఈనాడు అయింది.

ఒకరోజు వుదయం రామమూర్తి తన కాఫీ పొడుంకొట్టు తెరవబోతూవుండగా, పెద్దిరెడ్డి తన కొట్టులోనుంచి "యేమండోయ్! పంతులుగారూ! రండి! రండి! చిన్న వ్యవహారం యేర్పడింది." అని పొలికేక పెట్టాడు. రామమూర్తిది బ్రాహ్మణ కులం కాకపోయినా అందరూ అతనిని పంతులుగారూ అని పిలుస్తారు. సౌమ్యతనుబట్టి పిలుస్తారో, మాటతీరును బట్టి పిలుస్తారో లేక గోష్పాదాన్నిబట్టి పిలుస్తారో కాని, అందరూ అతనిని పంతులుగారని అంటారు. రామమూర్తికి ఆ కాఫీ పొడుంకొట్టు తప్పించితే ఆస్తిలేదు. దానిమీద వచ్చే ఆదాయం అతని కాస్త పొట్టకు, కొడుకు చదువుకు సరిపోతుంది. రామమూర్తి భార్య చాల కాలంక్రితం పోయింది. యింకో వూరిలో కాలేజీలో చదువుతున్న ఒక్క కొడుకు తప్పించితే, అతనికి పిల్లలు లేరు. వెంకటరావు స్కాలర్‌షిప్పు మీద చదువుకున్నాడు కాబట్టి, రామమూర్తికి అతని మూలంగా అట్టే ఖర్చు లేదు. ఇక హాస్టలులో సగం ఖర్చులు కాలేజీవాళ్లే భరిస్తారు. మిగతా సగం ఖర్చులు అతను యేదోవిధంగా యింతవరకు సర్దుతూనే వున్నాడు.

కొడుకు ప్రక్కవూరిలో వున్నాడు కాబట్టి, తన చిన్న పొట్టకి తానే వండుకుంటాడు. వీలైనంత తక్కువగా మాట్లాడటం అతనికి అలవాటు. అతనికి ఈ ప్రపంచంలో తన కాఫీపొడుం కొట్టు తప్పించి మిగతావేమీ తెలియవు; తెలుసుకోవాలనే ఆసక్తి లేదు.

"యేం పంతులుగారూ! హడావుడిగా కొట్టు తీస్తున్నారు. ఇంతకీ మీతో చిన్న వ్యాపారం విషయం మాట్లాడాలి" అన్నాడు పెద్దిరెడ్డి, తన కేక విని రామమూర్తి రాగానే.

"సెల వివ్వండి" అన్నాడు రామమూర్తి.

"ఆ యేం లేదు...మీకు యిక్కడ చూస్తే కాఫీ పొడివ్యాపారం పెద్దలాభం తెస్తున్నట్టులేదు. అదిగాక పోయినా మీకొట్టు యిక్కడ వుంటే యేంటో, మరోవీధిలో వున్నా అంతే.—కాఫీ పొడుం వ్యాపారం కదా! అందుకని మీ భాగం అమ్మటానికి వీలుంటుందేమో చూడండి. నాకు సుఖం; మీకు లాభం" అని యేమంటాడోనని రామ్మూర్తి వైపు చూశాడు, పెద్దిరెడ్డి.

రామమూర్తి కాసేపు ఆలోచించి, "అబ్బే, వీలుండదండీ, అన్నాడు. ఆ కొట్టు అమ్మటం అన్న ఆలోచన అతనికి కలలోకూడ తట్టలేదు. అతని జానెడు పొట్ట నింపుకోవటానికి ఏకైక సాధనం ఆ కాఫీపొడి వ్యాపారం. అతనికొట్టు వున్న చోట్లో తప్ప, మిగతా

చోట్లలో యింటికొకకొట్టు వెలిసింది. ఇక్కడ కొట్టు అమ్మితే అతను వ్యాపారం మానుకోవాల్సివుంటుంది ఈ సంగతి పెద్దరెడ్డికి తెలియనిది కాదు.

రామమూర్తి చెప్పిన సమాధానం విని, ఆలోచించి చెప్పండి, తొందరేమీ లేదు" అన్నాడు పెద్దరెడ్డి. కాని యిటువంటి సమాధానం వచ్చినందుకు కొంచం ఆశ్చర్యపడ్డాడు.

కాసేపు నిలుచుని "సెలవు తీసుకుంటాను" అన్నాడు. రామ్మూర్తి.

"వెళ్లిరండి"

* * * *

వారంరోజులు పోయాక మళ్ళీ కదిలిస్తే లాభం వుంటుందేమోనని ప్రయత్నించాడు, పెద్దరెడ్డి. రామమూర్తి వీధివెంట వెళ్తూంటే, పెద్దరెడ్డి "యేం పంతులు గారు! యేంచేశారు?"

"యేం చెయ్యటానికేముంటుందండీ!"

"అదిగానయ్యా! మళ్ళీ మొదటికొచ్చావేం. ఆ కొట్టు సంగతి యేంచేశావని నేననేది?"

"వీలుండదండి."

"వీలు లేదంటావు, మొత్తంమీద."

"అబ్బే కుదరదండీ."

"కుదుర్చుకుంటే అదే కుదురుతుంది; డబ్బు విషయం వెనకాడనులే."

"డబ్బు విషయం కాదండీ; నేనిక్కడ కొట్టు అమ్మితే యింకోచోట పెట్టటానికి వీలుండదు. యిక్కడ తప్ప ప్రతి వీధిలోనూ కాఫీ పొడుంకొట్టు వుంది కాదండీ!" అన్నాడు రామ్మూర్తి. ఆ విషయం పెద్దరెడ్డికి తెలియనిదికాదు. అయినా యింకా బేరం చేస్తూనే వున్నాడు.

"అందుకనే గద డబ్బు కొంచెం యెక్కువయినా కొంటానన్నది....యేమయినా నీకు వ్యాపారంలో సులువు తెలియదోయ్, పంతులూ" పెద్దరెడ్డి సంబోధనార్థకం 'అండి' దగ్గరనుంచి 'అయ్యా'కు, అక్కడినుంచి 'ఓయ్'కి మార్చాడు. ఇంకొంచెం సంభాషణ జరిగివుంటే 'ఏరా' వరకు వెళ్లివుండేది. తనకు యెదురుతిరిగిన వాళ్ళు అలా లోకువవుతారు, అతనికి.

రామమూర్తి అలా తిరస్కరించటం పెద్దరెడ్డికి చాల కష్టంగా తోచింది. రామమూర్తి తిరస్కరించకుండా బేరానికి దిగివుంటే, అయిదువేలు యివ్వవలసిన చోట యిరవైవేలు యిచ్చేవాడు. పెద్దరెడ్డి పూర్తిగా పాషాణంకాదు. పెద్దరెడ్డివంటి వ్యక్తులు తమకు యెదురుతిరగనంత వరకు యెంతైనా సహాయం చేస్తారు. పెద్దరెడ్డి దయామయుడుగా, ఉదారవంతుడుగా ఆ వూరిలో అందరికి తెలుసు. ఆ వూరికి హైస్కూలుభవనం కట్టించినపుడు అతన్ని యెవరు కొనియాడకుండా వున్నారు? వూరికి ఒక గ్రంథాలయం అంటూవుండటం అతనివల్ల కాదా? దగ్గరకు వెళ్లి చెయ్యిచాపితే ఎంతమందికి అతను ధనసహాయం చెయ్యలేదు? యెంతమంది అతనివల్ల విద్యాదానం పొందలేదు?—కాని మిగతా వారంతా అతని నీడ క్రింద బ్రతకాలి; అతను అన్నది కాదనరాదు. అప్పుడే అతను దయగా వుండగలడు. కాని తోటి మానవులమీద దయగాదు చూపవలసినది; చూపవలసినది ప్రేమ, సమభావం. దయ నోరులేని జంతువుల మీద, చూపెట్టాల్సినభావం. కాని చాలమంది ధర్మాత్ములు దయగా వుండగలరుగాని, ప్రేమతో, సమభావంతో వుండలేరు. అటువంటి వ్యక్తులలో పెద్దరెడ్డి ఒకడు.

రెండురోజుల తరువాత పెద్దరెడ్డి విసుగ్గా రోడ్డువైపుచూస్తున్నాడు. అతనికి యేమి చెయ్యాలో తోచటంలేదు. యింతలో వెంకటనారాయణ హడావుడిగా పరిగెత్తుకుంటూ వచ్చాడు. మోకాళ్ళపైకి మడచిన పంచతో, చాలీచాలని నల్లకోటులో అతని ఆకారం నవ్వొస్తున్నట్లుంటుంది. అతను నడుస్తూవుంటే పరిగెత్తుతున్నట్లుంటుంది. అతను మాట్లాడితే, యెవరూ అవగాహన చేసికోలేనంత తొందరగా మాట్లాడతాడు. అతను ఆ వూరిలో వుద్యోగంగాని, వ్యాపారంగాని చెయ్యటంలేదు. కాని యెప్పుడూ పని వొత్తిడి మీదేవున్నట్లు వుంటాడు. ఊరిలో యెంత మంది పనులు యితను చేసి పెడుతున్నాడో, యేమో!

కొట్టులోకి పూర్తిగా ప్రవేశించకుండానే "యేమిటోయ్ పెద్దరెడ్డి! విసుగ్గావున్నావు"అన్నాడు.

"రావోయ్, రా! చిరకాలదర్శనం" పెద్దరెడ్డి అందుకున్నాడు.

"పనుల వొత్తిడి! లేకపోతే గంట కొకసారి కనిపించకపోదునా—అవును గాని, నీకు రామ్మూర్తికి యేదో మనస్పర్ధలున్నాయట, సంగతేమిటి?" పెద్ద రెడ్డికి కావలసిన విషయం, అందుకున్నాడు వెంకట నారాయణ.

"అసాధ్యుడవోయ్! ఆవలిస్తే పేగులు లెక్క పెడతావుగదా!—యెలా తెలిసిందేవిఁటి?"

"తెలుస్తుందోయ్—అసలు సంగతేమిటో చెప్పు" అన్నాడు వెంకటనారాయణ.

"యేమీ లేదు. మన కొట్టు కొంచెం పెంచుదాం గదా అని, అతని కొట్టు అమ్ముతాడేమోనని అడిగాను. వాడికున్నది అణాన్నర వ్యాపారం—నెగవ కాఫీ పొడుం! రెండు రెట్లు ఖరీదువరకు యిద్దామని మనస్సులో వుందికాని, అసలు వీల్లేదంటే యేం చేస్తాం. బేరానికి దిగితే బాగుండేది. ఏదీ కాకుండా వీల్లేదంటాడాయె! వ్యాపారం అంటే అతనికి తెలియదోయ్" అన్నాడు పెద్దరెడ్డి.

"ఆ—వ్యాపారం అంటే తెలియక కాదులే. అంతా తల బిరుసుతనం. వాడికొచ్చే లాభాలు, యింకోచోట యేడిస్తే తగ్గుతయి కాబోసు! నాకూ తెలుసు ఈ కాఫీపొడి వ్యాపారం—"యింతకీ కొట్టు ఖరీదుకడగటానికి యెన్ని గుండెలుండాలి అంటున్నాడట" అన్నాడు వెంకటనారాయణ, చివరకు రహస్యం మాట్లాడినట్లు కంఠం మారుస్తూ.

"అంతవరకూ వచ్చిందీ!" అందుకున్నాడు పెద్ద రెడ్డి. వెంకటనారాయణ చెప్పింది నిజమూ అబద్ధమూ అని ఆలోచించే అవసరం పెద్దరెడ్డికి లేదు. అదీగాక, వెంకటనారాయణ పాతచరిత్ర పెద్దరెడ్డికి తెలియనిది కాదు. అతను యెన్ని కుటుంబాలకు నిప్పు పెట్టాడో, యెంతమందిని కోర్టులవరకూ లాగాడో—యివన్నీ పెద్దరెడ్డికి తెలుసు. వెంకట నారాయణ చేసిన అపచారాలను భరించలేక ప్రక్క వీధిలో రౌడీలు అతన్ని తన్నటం, వెంకయ్య నలుగురిలోనూ అతని మొహంమీద వుమ్మివెయ్యటం, మునిసిపల్ ఎలక్షన్లలో అతను డబ్బుకోసం చేసిన పనులు—యివన్నీ పెద్దరెడ్డి కళ్లముందే జరిగాయి; పెద్దరెడ్డికి బాగా తెలుసుకూడ. నిత్యఖర్చులకు వెంకట నారాయణ ఆర్జించే విధానం కూడ పెద్దరెడ్డికి తెలుసు. కాని అటువంటి సమయంలో యెదుటివాడు చెపుతున్నది నిజమా, అబద్ధమా అనికాని, న్యాయమా, అన్యాయమా అని కాని, ఆలోచించరు—యెదుటి వాడు తన పక్షమా లేక తన విరోధిపక్షమా అని మాత్రం ఆలోచిస్తారు. పెద్దరెడ్డికి యిప్పుడు కావలసింది 'తన పక్షం' మనుషులు, తనకు ఊఁ కొట్టే వ్యక్తులు కాని, న్యాయావలంబకులు, సత్యహరిశ్చంద్రులు కాదు. తీవ్ర విద్వేషాలు, అసూయలు పెంచుకున్నాక, యే మూలనుంచో పూర్తిగా చావని అంతరాత్మ, మనం భావించేదానిలో హెచ్చుభాగం అబద్ధమని ఘోషించినా, మనం చేసే పనులలో చాలవరకు అన్యాయమని మొగపెట్టుకున్నా, మనం చేసే స్నేహాలు నీచమయినవని సూచించినా, అటువంటివి భావించటం, ఆచరించటం మానము. చేస్తున్నంతసేపు విరోధిపట్ల అలా ప్రవర్తించటం తప్పులేదనిపిస్తుంది. ఎంత నిజాయితీగల వ్యక్తికయినా, తన విరోధి యింటికి దొంగతనం చెయ్యటం నేరంగా కనిపించదు; తన విరోధిని చంపటం ధర్మంగా కనిపిస్తుంది. విద్వేషాలలోపడి కార్యసాధనకు దిగినప్పుడు, నిలబడి మనలోని దురభిమానాలను, పక్షపాతాలను నిశ్చయించుకోగలమా? కొత్తమనుషుల్లా ప్రవర్తిస్తాం; చెయ్యరాని పనులు చేస్తాం.

"సరేలే" అందుకున్నాడు వెంకటనారాయణ "మా వియ్యంకుడిగారి వూరిలో కూడ యిలాటిదే జరిగింది. నా మాటవిని, నే చెప్పినట్లు చెయ్యి. వాడి రోగం మూడు నిముషాలలో కుదురుతుంది."

"యేవిఁటది?" ఆతృతతో అడిగాడు పెద్దరెడ్డి.

"చాలా సులభం. నువ్వుకూడ కాఫీపొడుం అమ్మటం మొదలుపెట్టు. నలుగురూ తెలిసినవాడివి. కాస్త ప్రయత్నించావంటే, నలుగురిని యిటు తిప్పవచ్చు. మొదటి నెల కాస్తచవకగా అమ్మావంటే అందరూ నీ కాఫీపొడికి యెగబడతారు. తరువాత రామ్మూర్తి సరుకు ఎలికలుకూడా తినవు. తరువాత కొట్టు అతిచవుకగా కొనొచ్చు, అప్పుడు—హఁ—మరి సెలవు—కాస్త దయాగా చూస్తూవుండు, నాలాటి బీదవాణ్ణి."

*    *    *    *

ఈ సంభాషణ జరగిన నెల రోజులలోపుగా, పెద్దరెడ్డి అండుకంపనీనుంచి మద్రాసులో పసిద్ధమైన కాఫీ వ్యాపారస్తులకు వుత్తరాలు వెళ్ళటం, అక్కడనుంచి పెద్దరెడ్డి అండు కంపెనీకి జవాబులు రావటం,

తరువాత ఒక ఏజంటు కొన్ని డబ్బాలతో కాఫీ పొడుం పట్టుకుని, పెద్దరెడ్డి అండుకంపెనీ, జనరల్ షాప్‌లోకి రావటంజరిగింది. తరువాత శ్రేష్టమయిన కాఫీపొడుం అతి చవకగా ఎక్కడ లభ్యమవుతుందో, పెద్దరెడ్డి దుకాణంలో అమ్ముతున్న కాఫీపొడియొక్క విశిష్టత యేమిటో, వివరిస్తూ సైనుబోర్డులు వేసి కరపత్రాలు పంచిపెట్టించాడు. నలుగురుకుర్రాళ్ళకు టోపీలు తొడిగించి "ఏంకాఫీ కావాలి?" — "రెడ్డికాఫీ కావాలి!" "యే కొట్టులో దొరుకుతుంది?" — "పెద్దరెడ్డిగారికొట్లో!" "ఖరీదెంత?" — "అతిచవుక!" అని కేకలు వేయిస్తూ వూరంతా తిప్పించాడు.

*　　*　　*　　*

రెండు నెలలుకూడ కాకపూర్వమే రామమూర్తి ఖాతాదారులలో చాలమంది పెద్దరెడ్డి కొట్టుకు వెళ్ళి కాఫీపొడుం తెచ్చుకుంటున్నారు. రామమూర్తి యిప్పుడు సరిగ్గా వ్యాపారం చెయ్యలేకపోతున్నాడు. ప్రతి రోజూ కొట్టు తియ్యటంలేదు. తీసినప్పుడయినా రోజంతా వుండటంలేదు. అప్పుడప్పుడు కొట్టు అమ్మిగామని వుందనే భావం స్ఫురించేటట్లు మాట్లాడుతున్నాడు.

*　　*　　*　　*

ఒకరోజు పెద్దరెడ్డి కొట్టులో, వెంకటనారాయణ పెద్దరెడ్డి మాట్లాడుకుంటున్నారు:

"అమ్మేట్టున్నాడట!" అన్నాడు పెద్దరెడ్డితో, వెంకటనారాయణ.

"యెవరు చెప్పారు? వాడే అంటున్నాడేమిటి చివరకు, యింత బ్రతుకూ బ్రతికి?" అన్నాడు పెద్దరెడ్డి తృప్తిగా నవ్వుతూ.

"మాటల సందడిలో అన్నట్లుంది. అయినా ఈ రాత్రి ఒకసారి కదలించి చూద్దాం" అన్నాడు వెంకటనారాయణ.

"ఈ రాత్రా?"

"అవును. యింటికి వెళ్దాం. అక్కడయితే సావధానంగా మాట్లాడవచ్చు."

"ఈసారి చాల చవుకగా బేరం చెయ్యాలి. మొత్తం ఆలోగిలితో కలసి యేడెనిమిది వేలూ ఖరీదు వుండొచ్చు. ఒక వెయ్యి రూపాయిలు కాఫీ పొడుం మీదవచ్చిన నష్టం. అందుకని అయిదారువేలకు బేరం చెయ్యొచ్చు."

"అయితే కాఫీ పొడుంమీద వెయ్యివరకు నష్టపోయావన్నమాట" అన్నాడు వెంకటనారాయణ వ్యంగ్యం ధ్వనించేటట్లు. నిజం చెప్పాలంటే, కాఫీ పొడుంమీద అయిన ఖర్చు, పెద్దరెడ్డి అప్పుడే రాబట్టాడు.

"అంతకన్నా దాటివుంటుంది" అన్నాడు పెద్దరెడ్డి, వెంకటనారాయణకు లోకువ అయినందుకు విచారపడుతూ.

"మొత్తం నాలుగు వేలకు బేరం చేద్దాం. మిగులు వెయ్యి నా కుంటుందిలే" అన్నాడు వెంకటనారాయణ, యేమీ ఆవేశం లేకుండా.

రాత్రి యెనిమిది గంటలకు అన్నం తిని బయలుదేరారు, వెంకటనారాయణ, పెద్దరెడ్డి, రామ్మూర్తి యింటికి. తలుపు తట్టబోయేసరికి లోపలనుంచి సన్నగా మాటలు వినిపిస్తున్నాయి. రామ్మూర్తి, అతని కొడుకు వెంకట్రావు మాట్లాడుతున్నారు.

"మధ్యలో ఆపెయ్యాల్సిందేనా?" — వెంకటరావు.

"మరేం చేస్తాం!" — రామ్మూర్తి.

"నెలకు ముప్ఫయి రూపాయిలయితే చాలు నాన్నా! మిగతాదంతా వాళ్లే పెట్టుకుంటున్నారుగా?"

"ఆ ముప్ఫయి మాత్రం యెక్కడ తీసుకురాను. పదిహేనురోజులయింది ఒక పాను కాఫీపొడుం అమ్మి!"

'ముప్ఫయి రూపాయిలు!' అని లేకేగదా తన చదువు మానుకున్నది. పెద్దరెడ్డికి పాతికేళ్ళక్రితం సంఘటన జ్ఞాపకంవచ్చి, 'ఛెళ్' మని కొరడాతో కొట్టినట్లయింది! వెంకటనారాయణ పిలుస్తున్నా వినిపించుకోకుండా పరిగెత్తుకుంటూ యింటికి వచ్చేశాడు.

*　　*　　*　　*

మరుసటిరోజు రామమూర్తి కాఫీ పొడుంకొట్టు తెరవగానే ఒక కవరులో వెయ్యిరూపాయిలు, ఈ క్రింది వుత్తరం వుంది.

"నీకు అపకారం తలపెట్టినందుకు ప్రాయశ్చిత్తంగా వెయ్యిరూపాయిలు యిస్తున్నాను. యిది నీ కొడుకు చదువుకోసం వినియోగిస్తే నా పాపం పరిహారమయినట్లు భావిస్తాను."

క్రింద సంతకం లేదు. ఎవరు వ్రాశారో రామమూర్తికి అర్థంకాలేదు. యెవరో కాని తలుపు కంతలోనుంచి వేశారు!

వారంరోజులలో పెద్దరెడ్డి కొట్టులో 'శ్రేష్టమయిన కాఫీ పొడుం' అమ్మటం మానేశారు. పెద్దరెడ్డిని యెవరైనా కాఫీపొడుంగురించి అడిగితే ప్రక్కనున్న రామ్మూర్తి కొట్టులో మంచి కాఫీపొడి దొరుకుతుందని చెప్పుతాడు. తనకు వెయ్యిరూపాయిలెవరుపంపించారో, అప్పుడు అవగాహన అయింది రామ్మూర్తికి!